


ఓగేటి ఇందిరాదేవి

# సుమాధవం

ఆమె ఒక పదిహేడేళ్ల బాలిక చక్కని చుక్క పోలిక పేదపిల్ల. ఆ సంవత్సరమే డిగ్రీలో చేరింది. సంవత్సరాంతంలో పబ్లిక్ పరీక్షల ముందర కాలేజ్ డే అనీ, హాస్టల్ డే అనీ, స్పోర్ట్స్ డే అనీ చాలా రకాల ఫంక్షన్లు జరుగుతుంటాయి గదా-ఆ రోజు హాస్టల్ డే-హాస్టల్ అమ్మాయిలు తామే గాక తమ స్నేహితురాలిని కూడా పిల్చుకోవచ్చు. కాకపోతే ఆ అమ్మాయికి కూడా డబ్బు కట్టాలి. ఈ సంవత్సరం తలా ఆర్రూపాయలూ పడింది. అంటే పార్టీ గొప్పగా ఉంటుందన్నమాట. ఆ డబ్బు కట్టిన తన తరపున వెంకటేశ్వరి అనే అమ్మాయి ఈ అమ్మాయిని పిలిచింది. ఈ అమ్మాయి పేరు సుమాంజలి. మొదట మొహమాటపడినా, ఏదో ఆలోచన వచ్చి, హాస్టల్ డేకి వెళ్లడానికి నిశ్చయించుకుంది సుమాంజలి.

"అక్కా! ఏం వదిలెయ్యకు. వడ్డించినవన్నీ తిను చక్కగా" అని చెల్లెలూ, తమ్ముడూ సలహా ఇచ్చారు. సుమాంజలికి కళ్లంట నీళ్లు తిరిగాయి. ఇద్దర్నీ దగ్గరికి తీసుకుని ముద్దులాడి "సరే గాని మీరు కూడా అన్నం తినేసి చదువుకుని పడుకోండి. నేను లేను గదా అని చదువు మానెయ్యకండి" అన్నది.

"నేను చూస్తాలే అక్కా, వీళ్ల సంగతి. నువ్వు తొందరగా బయల్దేరు" అంటూ పిల్లల బాధ్యత తను తీసుకుంది, పెద్ద చెల్లెలు కావ్యాంజలి.

వాళ్ల తండ్రి గొప్ప కవి. దగ్గర్లోనే ఉన్న పల్లెటూళ్లో తెలుగు ఉపాధ్యాయుడు. ఎయిడెడ్ స్కూలవటంతోనో ఏమో, జీతాలు సరిగ్గా రావు. ఆయన పేరు రామశర్మ-పెద్ద సంసారం ఈ జీతం డబ్బులు ఇరవై రోజులకి కూడా సరి పోవు. కానీ పిల్లల్ని బాగా చదివించాలని ఆయన ఆశయం. కానీ ఊరికి దూరంగా కాస్త చవగ్గా చిన్న రేకుల ఇల్లు అద్దెకి దొరికింది. అద్దె నెలకి ఇరవై రూపాయలు. కరెంటు లేదు. కాలేజీ మైలు దూరం. కావ్య స్కూలు ఇంకాస్త దగ్గిర రామశర్మకి తప్ప ఆ కుటుంబంలో ఎవ్వరికీ చెప్పులు లేవు.

హాస్టల్ డేకి వెళ్లడానికి మంచి బట్టలు లేవు. చివరికి పూల పూల చీటీ పరికిణీ, దానికి కుంకుమ రంగు వాయిల్ వోణీ, ఎర్రని ముతక జాకెట్టూ వేసుకోవాల్సి వచ్చింది. వాటికి చిన్నచిన్న చిరుగులున్నా కపడకుండా మానేజ్ చేసింది. నడుచుకుంటూ హాస్టల్‌కి వెళ్లింది.

హాస్టలంతా హడావుడిగా ఉంది. రంగురంగుల తోరణాలు కట్టారు. లౌడ్ స్పీకర్‌లో నించీ పాటలు వినిపిస్తున్నాయి. లేడీస్ హాస్టల్ కనక అంతా అమ్మాయిలే. మంచి బట్టలు కట్టుకుని అటూ ఇటూ తిరుగుతూన్నారు.

వెంకటేశ్వరి ఎదురొచ్చి, సుమాంజలి చెయ్యిపట్టుకుని తీసుకుని తీసుకెళ్లి "అక్కా! ఈ చీర కట్టుకుంటే ఎంత బావుంటావో!" అంటూ మంచి చీర కట్టించి. తల్లో పూలు తురిమి, తన దగ్గిరున్న కొత్త చెప్పులు వేసుకుని చూడమంది.

"ఎందుకు వెంకటేశ్వరీ, నీకింత అభిమానం నేనంటే?" అని అడుగుతున్న సుమాంజలి గొంతు గాద్గదికమైంది. కళ్ల వెంట నీళ్లు తిరిగాయి.

"నువ్వు ఎంత మంచిదానివో నీకు తెలియదు-చాలా బాగా చదువు తావని, మేమే కాదు, లెక్చరర్లు కూడా సంతోషిస్తారుగా. నువ్వు రేపు చాలా గొప్పదానివై తీరతావు. అప్పుడు మమ్మల్ని మర్చిపోకేం?" అప్పటికే చుట్టూ చేరిన అమ్మాయిలు అన్నారు.

"ఫంక్షన్లు ప్రారంభం కావడానికి టైముందిట. ఈ లోపల నువ్వు పాట పాడాలి. పద్యం చదవాలి. బారిస్టరు పార్వతీశం నవలలోని జోక్స్ చెపుతావే-అలాంటివింకేమన్నా చెప్పాలి!" అన్నది

వెంకటేశ్వరి.

"సుమాంజలి ఎంత బావుందో-మొదటనే నేను గుర్తు పట్టలేదు-నీ మొహంలో సరస్వతీకళ ఉట్టిపడుతున్నదమ్మాయ్!" అన్నది, అటుగా వచ్చిన బాటనీ లెక్చరర్ వసుంధర.

ఫంక్షన్ ప్రారంభమయ్యే లోపల సుమాంజలి ఎంకి పాట పాడింది. ఎప్పటిలా ఉత్సాహంగా మాట్లాడింది. అందర్నీ నవలలు చదవమన్నది. వెంకటేశ్వరి చీరా, చెప్పులూ ఇచ్చేసి తన బట్టలే కట్టుకుంది.

తర్వాత మీటింగు అయింది. ఆ తర్వాత డిన్నర్ ప్రారంభమైంది. రుచులూరించే ఐటమ్స్ చూస్తున్న కొద్దీ తమ్ముళ్లూ, చెల్లెళ్లూ గుర్తుకొచ్చారు. కాళ్లూ, చేతులూ చెమట పట్టసాగినై. ఎట్లాగో భోజనం మాత్రం చేసింది. బాదం ఖీర్ తాగింది. ఓణీ కొంగు ఒళ్లో పెట్టుకుని కూచుంది. కాకినాడ కాజాలు వడ్డిస్తే ఇంకో రెండు-మూడు అడిగి, మొహమాటంతోనే కాసిని బజ్జీలు కూడా వేయించుకుంది-రెండు చక్రకేళీ అరటిపళ్లూ, రెండు కిళ్లీలు ఘన పదార్థాలన్నీ కొంగులో వేసుకుంది. ఆరు రూపాయలంటే దాదాపు యాభయ్యేళ్ల కింద చాలా ఎక్కువ.

రాత్రి తొమ్మిది అయింది. అమ్మో! వెంకటేశ్వరీ! నేను వెళ్లొస్తానేం-అందరికీ చెప్పు" అని హడావుడిగా నడిచి, హాస్టలు బయటికొచ్చి ఊపిరి పీల్చుకుంది. చకచకా నడిచి ఇల్లు చేరుకుంది. ఇంత రాత్రి దాకా కూతురు రాలేదే అని తల్లి భయపడుతోంది. చిన్నచెల్లెలు తప్ప అంతా మేలుకునే వున్నారు.

"అమ్మా! నేనొచ్చేశా" అంటూ పళ్లెం తెచ్చి దాన్లో కొంగు కుమ్మరించింది-కాళ్లూ కడుక్కుని వచ్చే సరికి పిల్లల నోట్లో నీళ్లు. తల్లి కళ్లల్లో నీళ్లు. రామశర్మ ఊళ్లో లేదు.

**ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం-**
**ఎ.వి.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో**
**సాధారణప్రచురణకు స్వీకరించిన కథ**

"ఏమిటీ ఇది?" అన్నది తల్లి-

"ఇది నేను నా జీవితంలో చేసిన మొదటి దొంతగనం. అయినా ధర్మ బద్ధంగా నేను తినగలిగినన్నీ మాత్ర మే కొంగులో దాచుకుని వచ్చేశా. ఆ వార సరిపోయిందిగా!" అన్నది సుమాంజలి.

తల్లి అవన్నీ పెడుతుంటే ఎంత సంతోషంగా తిన్నారో పిల్లలు!

సుమాంజలి ఎమ్మేలో కూడా చెప్పుల్లేకుండా రెండు-మూడు నేత చీరలతోనే కాలక్షేపం చేసింది. యూనివర్సిటీ ఫస్ట్ వచ్చింది. అర్థాకలితో మాడుతూనే ఉంది కుటుంబం. తిండికీ, బట్టకీ మొహం వాచిపోతున్న చెల్లెళ్ల కోసం, వెంటనే ఉద్యోగంలో చేరిపోవాలన్న తపనతో, బియ్యే డిగ్రీతో ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌చేంజ్‌లో ముందే రిజిస్టర్ చేయించుకుంది సుమాంజలి.

ఎమ్మే పరీక్షలు రాయంగానే ఏదో చిన్న ఉద్యోగం వచ్చింది. వెంటనే చేరిపోయింది. ఆఫీసు చాలా దూరం. మూడు బస్సులు మారాలి. తక్కువ జీతం. అయినా లక్ష్యపెట్టలేదామె. తండ్రికి కుటుంబపోషణలో సహాయపడాలన్నది ఒకటే లక్ష్యం అమెకి-పొద్దున వెళ్తే సాయంత్రం వస్తుంది. తోటివాళ్లందరూ బుట్టల్లో కారియర్ పెట్టుకుని చిన్న తువ్వాలూ, నీళ్ల సీసా, వగైరాలు పెట్టుకుని వచ్చేవాళ్లు. ఒక పూట తిండే సరిగ్గా లేని సుమాంజలికి, మధ్యాహ్నం లంచ్ బాక్స్ ఎక్కడి నించీ వస్తుంది? ఆకలితో మాడుతూ ఆ ఉద్యోగం చేస్తుంది?

బియ్యేలో ఈ పిల్ల క్లాస్ మేట్ అరుణావాళ్ల కుటుంబం బస్ స్టాప్ కెళ్లే దారిలో ఉంది. అరుణకి పెళ్లైంది. సరిగ్గా అప్పుడే పుట్టింటికి వచ్చి సుమాంజలిని కలిసింది. ఆమె పరిస్థితి చూసి తల్లి సలహా అడిగింది. ఇలాంటివాళ్లే లోకంలో మానవత్వం చచ్చిపోలేదని నిరూపిస్తుంటారు.

"సుమ మనింటి మీదుగానే బస్ ఎక్కటానికి వెళ్తుంది. ఇక్కడ కాస్సేపు ఆగమను. మన టిఫిన్ బాక్స్‌లోనే అన్నమో, టిఫినో సర్ది యిచ్చేస్తాను. తీసుకువెళ్లి లంచ్ టైంలో తినమను. వెళ్లేటప్పుడు ఖాళీ బాక్స్ మనింట్లో ఇచ్చేసి వెళ్లమను-వాళ్ల పెద్దవాళ్లు ఏమన్నా అనుకోకుండా-" అన్నది తల్లి.

"థాంక్స్ అమ్మా!" అంది అరుణ, తల్లి మంచితనానికి ముగ్ధురాలవుతూ.

"ఇంత మాత్రానికే థాంక్స్ ఎందుకే? ముందా అమ్మాయి ఒప్పుకుంటుందో లేదో చూడు" అన్నదావిడ.

"నే ఒప్పిస్తానే అమ్మా ఎలాగోలా-" అంది అరుణ.

ఆ ప్రకారమే అరుణావాళ్లమ్మ గారిచ్చిన పెద్ద టిఫిన్ బాక్స్ తీసుకెళ్లసాగింది సుమాంజలి. మధ్యాహ్నం అన్నం తినేసి, "అన్నదాతా! సుఖీభవ" అనుకునేది మనస్ఫూర్తిగా.

"నాలుగు రోజులైనాక రేపు ఇడ్డెన్లు చేస్తున్నా సుమా! నీకు ఇష్టమేనా?" అని అడిగింది అరుణావాళ్లమ్మ- అరుణ ఊరికి వెళ్లే హడావుడిలో ఉంది.

"అయ్యో, చాలా ఇష్టమండీ. మీకు శ్రమ యిస్తున్నాను" అన్నది సుమ.

"చాల్లే-" అంటూ ప్రేమగా ఆమె భుజం తట్టింది అరుణావాళ్లమ్మ, మర్నాడు తనతోపాటు చిన్న తమ్ముణ్ని తీసుకెళ్లింది. అరుణా వాళ్లింటికి కాస్త దూరంగా నిలబెట్టింది.

యథాప్రకారం టిఫిన్ బాక్స్ తీసుకుని గబగబా వెళ్లి తమ్ముడి చేతికిచ్చి "ఇంటి కెళ్లి పిల్లలంతా తినండి" అని చెప్పి తను చకచక బస్ స్టాపు వైపుకెళ్లి పోయింది. పాపం, వాళ్లు ఇడ్డెన్ల మొహమే మెరుగుదురు? ఒక పూట మాడితే ఏం నేను? అనుకుంది సుమాంజలి. నిజానికి ఏ కాల మైందో ఆ పిల్ల కూడా ఇడ్డెన్లు తిని.

అప్పుడు, ఇప్పటిలా ఎక్కడ బడితే అక్కడ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లూ, పిజ్జా లూ, బర్గర్‌లూ, కూల్ డ్రింకులూ దొరికేవి కావు. ఎక్కడో చిన్న హోటలుండేది. మెయిన్ రోడ్డులో కాస్త పెద్ద హోటళ్లు ఉండేవి. ముఖ్యంగా ఇప్పుడు రోడ్ల మీద ప్రవహిస్తున్న డబ్బు ప్రజాసామాన్యం దగ్గిర వుండేది కాదు. కోటిమందిలో ఒకరికి కాస్త డబ్బుండేదేమో! ఏవో పొలాలూ, నగలూ ఉన్నా డబ్బు కళ్ల జూడటం అపురూపమే.

ఒక వేళ హోటళ్లు ఉన్నా, చేతిలో డబ్బున్నా, సుమాంజలి అటుకేసి వెళ్లదు. ఎవరైనా ఇంటి తిండి తినవలసిందే అని ఆమె తండ్రీ, తల్లీ చెప్పేవాళ్లు. "అమ్మాయీ! బయట తినుబండారాలు అమ్మేవాళ్లు మన ఆరోగ్యం కోసం వండరు. వాళ్ల డబ్బు కోసం ఎలాగో తయారు చేసి ఆకర్షణీయంగా రూపొందించి మనల్ని ప్రలోభపెట్టి కొనిపిస్తారు- ఉదాహరణకి ఫలానా కూల్ డ్రింక్ ఉంది. చూడు దాన్ని తయారు చెయ్యడానికి పావలా ఖరీదు పడుతుందేమో-వాళ్లూ దాన్ని మనకి రెండున్నర రూపాయలకి అమ్ముతారు. అంత కంటే మజ్జిగ మంచిది. కనీసం మంచి నీళ్లయినా మంచివే-కల్తీ పదార్థాలు కడుపులో చేరవు" అంటూంటాడు రామశర్మ. ఆయన పద్యాలు పాడుతుండేవాడు. తను వ్రాసినవి వినిపిస్తుండేవాడు. సుమాంజలి చాలా ప్రభావితురాలైంది. ఆయన వల్ల త్యాగం మహిమను తెలుసుకుంది.

ఈ చిన్న ఉద్యోగం పదిహేను రోజులు చేసిందో లేదో, సుమ రిజల్ట్స్ వచ్చాయి. ఫస్ట్ క్లాస్‌లో పాసైంది. యూనివర్సిటీ ఫస్ట్ ఎవరు అన్నది తర్వాత గాని తెలియదన్నారు-వెంటనే సెంట్రల్

గవర్న్ మెంట్‌లో వేరే ఊళ్లో ఉద్యోగం వచ్చింది తనకి. బంధువుల్ని ఎదిరించి అప్పటి దాకా తమ ఇళ్లలో ఆడపిల్లల్ని చదివించక పోయినా. రామశర్మ ఆడా, మగా తేడా లేకుండా పిల్లల్నీ చదివించాడు. ఆయన అర్ధాంగి విశాలమ్మ కూడా అందుకు ప్రోత్సహిం చింది. కడుపు కట్టుకుని ఆ దంపతులు పిల్లల్ని చదివించారు. ఈ నాటికి వాళ్ల కష్టం ఫలించింది. సుమాంజలి ప్రయోజకురాలైంది. ఇకనేం, ఆ కుటుంబం ఒక గట్టెక్కింది.

ఉద్యోగంలో చేరిన వారం రోజులకి చెప్పులు కొనుక్కుంది సుమ. అరుణా వాళ్లమ్మగారి కాళ్లకి దణ్ణం పెట్టింది. ఉద్యోగంలో చేరడానికి వెళ్తాంటే ఆవిడ కొత్త వాయిల్ చీర పెట్టింది. మూడు-నాలుగు నెలల్లో రెండు-మూడు వాయిల్ చీరలూ, ఒకటి-రెండు నేత చీరలూ కొనుక్కుంది. మధ్యమధ్యలో ఇంటికి వెళ్లినప్పుడల్లా తను పొదుపు చేసి కూడబెట్టిన డబ్బూ, పిల్లలకి బట్టలూ ఇచ్చి వచ్చేది. చిన్న చెల్లెలు 'గీతాంజలి ముచ్చట పడుతున్నదని ఆకుపచ్చ రంగుకి ఎర్ర రంగు జరీ ఉన్న పట్టు పరికిణీ, జాకెట్ కొన్నది. తను చాలా పొదుపుగా వుండేది. మామూలు చీరలు కట్టేది.


తోటి ఉద్యోగులు జల్సాగా ఖర్చు చేసేవాళ్లు. "ఏమిటి సుమా! ఇరవై రెండేళ్లకి యాభయ్యేళ్ల ముసలమ్మలా ఉంటావు. ఏ వయసులో అనుభవించే సరదాలు ఆ వయసులో అనుభవించాలి గాని, తర్వాత కుదరదు. మన శరీరమే సహకరించకపోవచ్చు. తనకి మాలిన ధర్మం మొదలు చెడ్డ బేరం అంటారు. ముందు నువ్వు సుఖపడి తర్వాత మిగిలిన డబ్బు ఇంటికి పంపించు ఎంత దగ్గర బంధువులైనా చేసినంత కాలం చేయించుకుంటారు. తర్వాత గుర్తు కూడా పెట్టుకోరు" అని నచ్చ చెప్పేవాళ్లు ఫ్రెండ్స్.

"మా అమ్మా, నాన్నా చదివిస్తే కదా నేనీ స్థితికి వచ్చింది!" అనేది సుమాంజలి.

"కృతజ్ఞత ఉండాల్సి గాని శ్రుతి మించకూడదు సుమా! అనుభవం మీద చెప్తున్నాను. దీనికి జీవితకాలం మూల్యం చెల్లించాల్సి వస్తుందేమో కూడా చెప్పలేం." సీని యర్ అయిన తులసి నచ్చచెప్పాలని చూసింది.

"కొంత కాలం నేను మా వాళ్లకి సహాయం చెయ్యక తప్పదు మేడమ్! మా పెద్ద తమ్ముడి చదువైపోయాక రెండు-మూడేళ్లల్లో మా నాన్న చేతికి అందివస్తాడు గదా. అప్పుడు కాస్త తప్పుకుంటాను. తర్వాత మా పెద్ద చెల్లెలు కావ్య ఎక్కి వస్తుంది..."

సుమాంజలి మాటలకి అడ్డు వచ్చింది తులసి-"అప్పుడు పూర్తిగా నీ బాధ్యత తీర్చే సుకుంటావుగా-కానీ సుమా! అలవాటు పడ్డ ప్రాణం మీ వాళ్లు నిన్ను వదుల్తారా? అనుమానమే. దిగువ మధ్యతరగతి వాళ్ల మనస్తత్వం చెప్తున్నా. అంతే ఇప్పుడు క్రమంగా



మీ ఇల్లు ఎగువ మధ్య తరగతి అవుతుంది. తర్వాత హై క్లాస్ అయినా ఆశ్చర్యం లేదు. ఈ లోపల నీ యౌవనం కర్పూరంలా హరించుకు పోవచ్చు. ఆ ఇంటికి పునాదివైన నువ్వు పైన వేసే భవనానికి మొదటి మెట్టుగా బిగిసిపోవచ్చు. జాగ్రత్త నాలుగేళ్ల కైనా పెళ్లి మాట తలపెట్టు."

చివర చివర హాస్యంగా తేల్చేసింది గానీ, ఆ తులసీమేడమ్ మాటలు సుమని ఆలోచింపచేశాయి. "కానీ ఇప్పుడీ బంధనాలు వదులు కొనేను. ఇరుక్కుపోయాను. నాలుగైదేళ్లకి ఇవతల పడగలిగితే చాలు." మొదటి సారిగా తన గురించి ఆలోచించింది సుమ.

మాధవ్ స్ఫురద్రూపి. చలాకీగా ఉంటాడు. సుమ ఆఫీసులోనే ఉద్యోగం చేస్తూ సివిల్స్‌కి చదువుతున్నాడు. రోజూ సుమని చూస్తూందేవాడేమో. తల వంచుకుని ఆఫీసుకుకి వచ్చి సిన్సియర్ గా తన పని చేసుకునే ఆమె మీద సదభిప్రాయం కలిగేది. మొదట్లో రానురాను ఆ అభిమానం ఇష్టంగా మారింది కూడా.

"సుమాంజలిగారూ! మీరెప్పుడూ గుడికెళ్తూంటారు గదా. ఇవాళ గుడిని త్యాగం చేసి నా కోసం గాంధీనగర్ పార్కుకి రాగలరా?" అని అడిగేశా డొకసారి.

ఈ 'నా కోసం' అనే మాటతో ఒళ్లు జల్లుమన్న దామెకి. ఒక నిమిషం ఆలోచించి సరే అన్నట్లు తల ఊపింది.

చిన్న చిన్న పూలున్న గులాబి రంగు ఫుల్ వాయిల్ చీర కట్టుకుని అదే రంగు జాకెట్టు వేసుకుంది. మొహం కడుక్కుని బొట్టూ, కాటికా పెట్టు కుంది. బిగించి జడేసుకుకుంది యథాప్రకా రం. పక్కింటావిడ చిన్న పూల మాల ఇచ్చింది, గుళ్లో యిచ్చారని. కళ్లకద్దుకుని తలలో తురుముకుంది.

"ఏమిటమ్మా! ఇవాళ ఇంత చక్కగా తయారైనావు. పెళ్లి కూతుర్లా ఉన్నావనుకో" అని సంతోషించింది పక్కింటావిడ.

ఆవిడ కంటపడకుండా సిగ్గు పడింది సుమాంజలి.

పార్కు కెళ్తుంటే వణుకొచ్చింది. గేటు దగ్గిరే నిలబడిపోయింది.

"బావుందండీ-మిమ్మల్ని రమ్మన్నది పార్కుకి గాని గేటవతలికి కాదు. రండి-ఎందుకింత నెర్వస్‌గా ఫీలవుతున్నారు?" అని పిల్చాడు మాధవ్.

పార్కులో కూచుని గడ్డి తెంపుతోందామె తలొంచుకుని.

"అయ్యయ్యో! నేను ఈ గడ్డి పీకటానికి పిలవలేదండీ మిమ్మల్ని" తమాషాగా అన్నాడు మాధవ్.

చప్పున నవ్వొచ్చిందామెకి.

"ఆహా! నేనెంత అదృష్టవంతుణ్ని! దానిమ్మగింజల్లాంటి పలువరుస చూడగల్గాను. మన ఆఫీసులో ఎవ్వరూ చూడలేదనుకుంటాను. జీవితాంతం మిమ్మల్నిలా నవ్వించుకుం టాను. అందుకు పర్మిష నిస్తారా?" అన్నాడు అతగాడు.

"అంటే?"

"అనుకున్నా-ఇలా అడుగుతారనే అనుకున్నా. మిమ్మల్ని పెళ్లి చేసుకుంటాను. ఇష్టమేనా? ఇప్పుడు క్లియర్‌గా అర్థమైందా పోనీ?" అని అడిగాడు మాధవ్.

"నేను-నేను మీకు తగినదాన్నేనా? మీరేం ఆలోచించకుండా..." గాద్గదికమైన గొంతుకేదో అడ్డం పడినట్టు ఆగిపోయిందా పిల్ల.

"భలేవారు-అన్నీ నాకు తెలుసు. ఆలోచించాను. పూలచీర చుట్టిన పుష్యరాగంలా వుంటారు. మసిగుడ్డలో కట్టిన మాణిక్యం అనలేను. చిటారు కొమ్మన పూసిన గులాబీ పువ్వులా ఉంటారు. మిమ్మల్ని అందుకోవాలంటే చాలా ముళ్లు గుచ్చుకుంటాయనీ తెలుసు" అన్నాడు మాధవ్.

"సివిల్స్‌లో మీరు తెలుగు తీసుకున్నట్లున్నారు-"

"ఔను-భలే కనిపెట్టేరే!"

"గొప్పే-కాని మా పెద్దవాళ్లతో ఎవరు చెప్తారు? వాళ్లేమంటారో?"అన్నది సాలోచనగా సుమాంజలి.

"ఏమంటారు-కూతురి పెళ్లంటే సంతోషించరా? నేనే వాళ్లకి ఉత్తరం రాస్తాను. సరేనా? వాళ్లనొచ్చి మా పెద్దవాళ్లతో మాట్లాడమని, నాకు కట్నం అక్కర్లేదు, ఈ సుగుణాల రత్నాలరాశి చాలు" అన్నాడు మాధవ్, ఆమె చెయ్యి చేతిలోకి తీసుకుంటూ.

మెల్లిగా విడిపించుకుని, "ఇంక వెళ్తాను-పొద్దు పోతోంది" అంది సుమాంజలి.

"నేను స్కూటరు మీద దింపనా?" అడిగాడతను-

"వద్దు-నేను రిక్షాలో వెళతాను" అన్నదామె

సుమ తండ్రి రామశర్మగారికి ఉత్తరం వ్రాశాడు, మర్నాడే మాధవ్. కాని జవాబు రాలేదు.

తులసి బలవంతం మీద ఇంటికెళ్లింది సుమాంజలి.

కూతుర్ని చూసి తండ్రి తల వంచుకున్నాడు.

తల్లి తల తిప్పుకుంది.

చెల్లెళ్లూ, తమ్ముళ్లూ "ఏం తెచ్చావు? ఏం తెచ్చావు అక్కా! మా కోసం" అని ఎగబడకుండా రుసరుసలాడు తున్నారు.

సుమ భయపడిపోయింది. తనే గొంతు పెగల్చుకుని, "పెద్ద తమ్ముడేడి? కనిపించడం లేదు" అన్నది.

"వాడికి బెంగళూరులో మంచి ఉద్యోగం వచ్చింది కదా. ఇంక ఇల్లు గట్టెక్కుతుందిలే అనుకున్నా. వాడు బెంగళూరు వెళ్తూ వెళ్తూ ఎవర్నో ప్రేమించాట్ట, దాన్ని కూడా తీసుకుని వెళ్లిపోయాట్ట. మనం ఒప్పుకోమని-అక్కడే పెళ్లి చేసుకుని ఉద్యోగం చేసుకుంటున్నాడుట. ఒక ఉత్తరం రాసి పడేశాడు" బెంగగా, బాధగా చెప్పింది తల్లి.

"ఇంక నీ పెళ్లి ఎట్లా చేయమంటావు చెప్పు?" అన్నాడు తండ్రి బాధ పడుతూ.

సుమ మెదడు పని చెయ్యటం మానేసింది. ఇంత తొందరగా పెళ్లి చేసుకున్నాడా? ఇంత తెలివా వాడికి అనిపించింది కాస్సేపటికి.

ఏం మాట్లాడకుండా ఆ శనిఆదివారాలుండి వచ్చేసింది. "అయితే-నీ నిర్ణయం మారదా? మాధవ్ మాట మట్టిగడ్డేనా?" అని అడిగింది తులసి-

ఆవిడని కరుచుకుపోయి బావురుమని ఏడ్చింది సుమాంజలి.

తర్వాత మెల్లిగా చెల్లెళ్లూ, తమ్ముళ్ల పెళ్లిళ్లూ అయిపోయినై. అంతా అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్ వెళ్లి వస్తుంటారు. సుమాంజలి వీళ్ల పెళ్లిళ్లకీ, చదువులకీ, అయిన అప్పు మెల్లిగా తీర్చుకుంటోంది. మిగతా పిల్లలు యమ బిజీ గదా. ముసలి తల్లిదండ్రుల్ని సుమాంజలి దగ్గరే వదిలేశారు తండ్రి రాసిన అముద్రితపుస్తకాలు ప్రచురిం చింది. వాళ్లకి సేవ చేసి ఎక్కడా లోటు లేకుండా చూసింది. ఇద్దరూ వెళ్లిపోయారు. చెల్లెళ్ల పెళ్లిళ్లకైన అప్పులు తీర్చింది. పురుళ్లు పోసింది. సుమాంజలికి జుట్టు నెరుస్తోంది.

అనారోగ్యం చుట్టుముట్టింది. గుప్పెడు అన్నం తినలేకపోతోంది.

"అయ్యో! అత్తా ఈ కాస్మెటిక్స్ లేకుండా ఎట్లా? జుట్టు విర బోసుకోకపోతే నవ్వుతారు. బాబ్డ్ హెయిర్‌కి రంగుల్లు పూయించు కోలేకపోతే బావుండదు" అని తమ్ముళ్ల పిల్లలు నవ్వారు. "లేకపోతే నీలాగా చిన్నప్పుడే ముసలమ్మలా కొంగు కప్పుకుని గానుగెద్దులా ఒకే ఉద్యోగం చేస్తూ మేము బతకలేం పెద్దమ్మా! మాది యువరక్తం. మా స్టయిలే వేరు" అన్నారు చెల్లెలు పిల్లలు.

తమ్ముళ్ల పిల్లలూ, చెల్లెళ్ల పిల్లలూ అప్పుడప్పుడు వచ్చేవాళ్లు.

"ఒసే, పెదాలకి ఎప్పుడూ ఆ లిప్ స్టిక్ వాడితే నల్లగా అయిపోతాయే. మొహాలకి ఆ కాస్మెటిక్స్ వాడటం మంచిది కాదే. ఒళ్లంతా కనపడేట్టు ఈ డ్రస్సులేమిటి? తెలుగు మాట్లాడండే" అని చెప్పింది ఒకసారి.

"అయ్యో! అత్తా ఈ కాస్మెటిక్స్ లేకుండా ఎట్లా? జుట్టు విర బోసుకోకపోతే నవ్వుతారు. బాబ్డ్ హెయిర్‌కి రంగులు పూయించు కోలేకపోతే బావుండదు" అని తమ్ముళ్ల పిల్లలు నవ్వారు.

"లేకపోతే నీలాగా చిన్నప్పుడే ముసలమ్మలా కొంగు కప్పుకుని గానుగెద్దులా ఒకే ఉద్యోగం చేస్తూ మేము బతకలేం పెద్దమ్మా! మాది యువరక్తం. మా స్టయిలే వేరు" అన్నారు చెల్లెలు పిల్లలు.

ఒక రోజు కడుపు నొప్పి ఎక్కువగా వచ్చింది. మాధవ్ వేరే రాష్ట్రంలో కలెక్టరుగా పని చేస్తున్నాడు. చాలా ఏళ్లకి అతను స్వరాష్ట్రానికి వచ్చి సుమాంజలిని చూడటానికి వచ్చాడు. మూడు గదుల అద్దె ఇంట్లో కడుపులో నొప్పితో కిరకిరలాడిపోతున్న ఆమెని చూసి, కళ్లల్లో నీరు తిరిగింది అతనికి. తోడు కూడా ఎవరూ కనపడలేదు. వెంటనే మంచి హాస్పిటల్‌లో చేర్పించాడు. చకచక టెస్టిలన్నీ జరిగాయి

"అసలేమైంది?" అని ఆత్రంగా అడిగిన మాధవ్‌ని చూసి, నిట్టూర్చాడు డాక్టర్.

"బహుశా చిన్నప్పట్నించీ సరిగ్గా తినకనేమో... అల్సర్ తీవ్రంగా వచ్చింది. ఈమె శరీరంలో అవయవాలు సరిగా పని చెయ్యటమే లేదు. ముందే డాక్టర్ల దగ్గర కెళ్తే రోగనిర్ధారణ చేసి మందులిచ్చేవాళ్లే. సరే ముందు అల్సర్‌కి ఆపరేషన్ చేస్తే మంచిది. అయిన వాళ్లు ఎవరూ లేరా?" అని అడిగాడు డాక్టర్.

"నాకూ తెలియదు. నేను సంతకం చేస్తాను. ముందు ఆపరేషన్ మొదలుపెట్టండి" రుద్ధకంఠంతో అన్నాడు మాధవ్.

ఇంతలో "ఆమెకి స్పృహ వచ్చింది. మిమ్మల్ని పిలుస్తోంది" అంటూ వచ్చింది సర్సు.

గబగబ వెళ్లాడు అతను.

కళ్లెత్తి మాధవ్‌ని నిండుగా చూసుకుని, "మీరా నన్ను హాస్పిటల్‌కి తీసుకొచ్చింది? ఎందుకు? ఇంకా బతికి నేనేం చెయ్యాలి?" అంటూ వెక్కివెక్కి ఏడ్చింది.

ఆమె తలపై చెయ్యి వేసి అనునయంగా, "ఇంకా రిటైర్ కూడా కాలేదు. నువ్వు కావాలనే నెగ్లెక్ట్ చేశావన్నమాట ఆరోగ్యాన్ని. తప్పు. నీకు ఆపరేషన్ చేస్తే తగ్గిపోతుందిట. నేను డాక్టర్‌ని కనుక్కున్నాను" అన్నాడు డగ్గుత్తికతో మాధవ్.

"నేను ఎలాగైనా హరిద్వార్ వెళ్లి చచ్చిపోదామనుకున్నాను. కానీ వెళ్లలేకపోయినాను. నా పూర్వజన్మపుణ్యం వల్ల హరిద్వారమే నా దగ్గరికి నడిచివచ్చింది. మళ్లీ పై జన్మలో మిమ్మల్ని మిమ్మల్ని..." అంటూ ఆత్రంగా మాధవ్ చెయ్యి పట్టుకుంది. వెంటనే ఆ చెయ్యి జారిపోయింది.

మాధవుడి (వసంతకాలం) ఎడబాటుతో వేచిపోయిన సుమం (పువ్వు) వాడి వత్తలై రాలిపోయింది.